ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



కూకట్‌పల్లిలోని జమా మసీద్

కూకట్‌పల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఈద్-ఉల్-ఫితర్‌ను సోమవారం ముస్లిం సోదరులు జరుపుకోనున్నారు. కూకట్‌పల్లిలోని జామా మసీద్, మూసాపేటలోని ఈద్గాలలో ఉదయం 8గంటల నుంచే రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబు చేశారు. ఆకాశంలో నెలవంక కనిపించడంతో నెల రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలకు నేటితో ముగింపు పలకనున్నారు. కూకట్‌పల్లి జామా మసీద్ కుతుబ్‌షాహి కాలంలో నిర్మించారని ఎంతో ప్రత్యేకథ ఉన్న కూకట్‌పల్లి మసీద్‌కు 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. రంజాన్ సందర్భంగా మసీద్‌లో ఉదయం 8గంటల నుండే ప్రార్థనలు ప్రారంభమౌతాయి.

ఫిత్రా: రంజాన్ మాసం సందర్భంగా ప్రతి ముస్లిం ఫిత్ర ఇవ్వడం తప్పనిసరి. కుటుంబంలోని ప్రతిఒక్కరి పేరున ఫిత్ర చెల్లించడం అనవాయితీ. ఒక్కో వ్యక్తి తమకు వచ్చిన ఆదాయం ఆధారంగా ఫిత్ర చెల్లిస్తారు. పేదవారు రూ.100 నుంచి రూ.450 గోధుమల ధరకు అనుగుణంగా కుటుంబ పెద్ద ఫిత్రాలను చెల్లిస్తారు. అలాగే మధ్య తరగతి.. ధనవంతులు ఖర్జూర పండ్ల ధర ఆధారంగా వారికి తోచినంత ఫిత్ర చెల్లిస్తారు.

జకాత్: ఆర్థిక స్తోమత బాగా ఉన్నవారు జకాత్ చెల్లించడం ఆనవాయితీ, ఎవరి స్తోమతకు తగినట్లు వారు జకాత్ చెల్లించాలి. లక్ష రూపాయల ఆదాయం ఉంటే రూ.2500 చొప్పుల జకాత్ చెల్లిస్తారు. వారి బంధువులకు కాని, పేద ముస్లింలకు ఎవరికైనా సరే జకాత్ చెల్లించడం ఆనవాయితీ అని ముస్లిం మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. ఏదైనా అనివార్య కారణాలతో జకాత్.. ఫిత్రలు చెల్లించని వారు రంజాన్ పండగ రోజు చెల్లిస్తారు.

నేడు కేపీహెచ్‌బీ ఈద్గాలో రంజాన్ వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం పురస్కరించుకొని సోమవారం కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ ఈద్గాలో రంజాన్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం 7.30 గంటలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరుకానున్నారు. అక్కడ జరిగే ప్రార్థనల్లో ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొనేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముస్తాబైన జమామసీద్

కూకట్‌పల్లిలో ఉన్న జమా మసీద్‌కు 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. కుతుబ్‌షాహి కాలంలోనే కూకట్‌పల్లి గ్రామంలో జమా మసీద్ నిర్మించారని అప్పటినుంచే ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఇదే మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్నారు. కూకట్‌పల్లిలో జమామసీద్‌లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలకు అన్ని సిద్ధం చేసినట్లు మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇఫ్తార్ విందులకు విరామం

రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టిన వారికి ఇఫ్తార్ విందులు ఇచ్చారు. కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో పాటు హిందువులు పాల్గొని మతసామస్యానికి ప్రతీకగా నిలిచారు. రంజాన్ నెలవంక దర్శనంతో ఉపావాస దీక్షలతో పాటూ ఇఫ్తార్ విందులకు విరామం పలికారు.



కేపీహెచ్‌బీ మూడోఫేజ్ బ్రాహ్మంగారి ఆలయంలో ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్



శ్రీలాపార్క్‌ప్రైడ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం వింటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పంచాంగ శ్రవణం వినేందుకు శ్రీలాపార్క్‌ప్రైడ్ వాసులు ఆసక్తిక నబర్చారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలోని పంచముఖ ఆంజనేయుడిని భక్తులు దర్శించుకున్నారు.





కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లో జరిగిన పంచముఖ ఆంజనేయస్వామికి నైవేద్యం సమర్పించిన భక్తులు



'హిందూ వాహిని' సంస్థ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్‌లో ఆదివారం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బాగ్ ప్రతినిధి సి.హెచ్. శ్రీనివాస్ రెడ్డి, హిందూ వాహిని కార్యకర్తలు అభిషేక్, బీజేపీ నేతలు, కృష్ణ, కుమారస్వామి, వెంకటరామిరెడ్డి, సంతోష్, మురళీ మోహన్, జితేందర్, శశి, ఆనంద్ సేల్, నరసింహ, శివ, శ్రీశైలం, సర్వేష్ పాల్గొన్నారు.

\- అల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)

● ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లిలోని వడ్డేపల్లి రాజేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్బనపల్లి సూర్యరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అతిథులకు ఉగాది పచ్చడిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పాపరావు, డాకయ్య, సీహెచ్ శ్రీనివాస్ గౌడ్, టీవీఆర్ఆర్ సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

\- హైదర్‌నగర్, మార్చి30 (ఆంధ్రజ్యోతి)



వేడుకల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్బనపల్లి సూర్యరావు, రాజేశ్వరరావు



ఏపీ సీఎం చంద్రబాబు చేతులమీదుగా ఉగాది పురస్కారం అందుకుంటున్న రచయిత్రి యలమర్తి అనురాధ

రచయిత్రి యలమర్తి అనురాధకు ఉగాది పురస్కారం

అల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి యలమర్తి అనూరాధకు విశేష గౌరవం దక్కింది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా యలమర్తి అనూరాధ తాను సాహితీ రంగానికి చేసిన విశేష సేవలకు గానూ ఉగాది పురస్కారమందుకున్నారు. ఇదే వేదికన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిపై అప్పటికప్పుడు ఆమె చెప్పిన కవిత పలువురిని ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరేళ్ల విరామం తర్వాత ఇచ్చిన ఉగాది పురస్కారం, పంచాంగ శ్రవణంతో పాటు సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రకళ, శిల్పకళ, నాటక, జానపద కళలు, అవధానం, మిమిక్రీ, హరికథ, జర్నలిజం, వైద్య సేవలు, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందించిన వారకి గుర్తింపుగా ఈ పురస్కారాలను ఏపీ ప్రభుత్వం అందజేస్తుంది. ఉగాది పురస్కారం ఈయేడు సుమారు 100 మందని ఎంపిక చేయగా, అందులో అనూరాధకు చోటు దక్కింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళాకారులను శాలువాలతో సత్కరించి పదివేల రూపాయల నగదు పురస్కారంతోపాటు, తెలుగుతల్లి జ్ఞాపికను చంద్రబాబు అందించారు. 'విశ్వావసు నామ ఉగాది' పురస్కారానికి యలమర్తి ఎంపికవటం ఎంతో ఆనందదాయకమని, తన యాభై ఏళ్ల సాహిత్య పరిశ్రమకు ఫలం, ఫలితం దక్కిందని అనూరాధ పేర్కొన్నారు.

రామాలయంలో విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

● హాజరైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రామాలయంలో రాతి విగ్రహాల ఏర్పాటులో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భూమిపూజ చేశారు. ఆదివారం రామాలయంలో రాజగోపురానికి ఇరువైపులా శ్రీ ఆంజనేయ, గరుత్మంతుడు విగ్రహాలను దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా హాజరైన ఎమ్మెల్యే రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు విరాళంగా రాజేశ్‌కుమార్‌రెడ్డి లక్ష రూపాయలు, కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంతోష్ రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లిసత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావు, పండాల సతీష్‌గౌడ్, మాజీకార్పొరేటర్ బాబురావు, ఆలయ మాజీచైర్మన్ తులసీరావు, శివాలయం మాజీ చైర్మన్ నాయినేని సూర్యారావు పాల్గొన్నారు.

నేడు ఆస్తిపన్ను చెల్లింపునకు అవకాశం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో ఆస్తిపన్ను చెల్లించేందుకు సోమవారం కూడా అవకాశం ఉందని డిప్యూటీ కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ తెలిపారు. పాత బకాయిలు చెల్లించి వడ్డీలో 90శాతం రాయితీ కూడా పొందవచ్చన్నారు. మూసాపేట్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సీఎస్‌సీ సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు ఆస్తిపన్ను చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జంట సర్కిళ్ల నివాసితులు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని డీసీలు కోరారు.



పంచాంగ శ్రవణం

అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్‌లోని శ్రీ వినాయక శివపార్వతి హనుమాన్ నాగదేవత సమేత నవగ్రహ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉగాది నూతన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, కాలనీ వాసులు

\- అల్లాపూర్, (ఆంధ్రజ్యోతి)

ప్రజాసేవకు విరమణ లేదు

బాలానగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ వయస్సుకే తప్ప ప్రజా సేవకు ఉండదని అదనపు డీసీపీ సత్యనారాయణ, అదనపు ఎస్పీ హనుమంతారావు అన్నారు. బాలానగర్ సీఐ నర్సింహ్మారాజు ఆధ్వర్యంలో హెచ్‌ఏఎల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఏఎస్ఐ అంజనేయులు పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ అంజనేయులు తన విధి నిర్వహణలో చేసిన సేవలను సభకు వివరించి ఆయన సేవలను పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహ్మారాజు మాట్లాడుతూ, ఇంత కాలం పోలీసు శాఖకు సేవలందించిన అంజనేయులు శేషజీవితాన్ని ఆయురారోగ్యం, సుఖశాంతులతో గడపాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు డీసీపీ సత్యనారాయణ, అదనపు ఎస్పీ హనుమంతారావు, సీఐలు అంజనేయులు, ఆయన సతీమణి విజయలక్ష్మిని శాలువా, గజమాలతో సత్కరించి స్వీట్లు తినిపించి జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాలానగర్ అడ్మిన్ ఎస్సై రాంనారాయణ, హాజిమియా, సరళ, ఏఎస్ఐలు వెంకటేశం, వినోద్, హెచ్‌సీలు , పీసీలు పాల్గొన్నారు.



ఏఎస్ఐ అంజనేయులు దంపతులను శాలువా గజమాలతో సత్కరిస్తున్న అదనపు డీసీపీ సత్యనారాయణ, అదనపు ఎస్పీ హనుమంతారావు, సీఐ నర్సింహ్మారాజు



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛఅభియాన్ ఫౌండర్ మాధవరం కాంతారావు

బీజేపీ కార్యాలయం వద్ద చలివేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు చలివేంద్రం ప్రారంభించారు. అదివారం బీజేపీ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి, మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సూర్యప్రకాశ్‌రావు, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, సూర్యరావు అన్నారు. అనంతరం మంచినీరు, మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్, పద్మాకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం అభినందనీయం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని వినాయక టెంపుల్ వద్ద క్షత్రియ యూత్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఆదివారం డా. విజయవర్మ దంపతులు చలివేం ద్రం ప్రారంభించారు. వేసవిలో పాదాచారుల దప్పిక తీర్చేందుకు తాగు నీరు, మజ్జిగ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఎన్ రాజు, కల్యాణ్ వర్మ, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరల ఇలా ఉన్నాయి. టమోట రూ.11, వంకాయ రూ.18, బెండకాయ రూ.35, పచ్చి మిర్చి రూ.45, బజ్జి మిర్చి రూ.23, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.10, బీన్స్ రూ.55, క్యారెట్ రూ.18, గోబి పువ్వు రూ.18, దొండకాయ రూ.28, చిక్కుడు కాయ రూ.55, గోరు చిక్కుడు రూ.35, బీట్‌రూట్ రూ.17, క్యాప్సికం రూ.35, ఆలుగడ్డ రూ.23, కీర రూ.15, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.16, కంద రూ.65, ఉల్లిపొరక రూ.23, ఉల్లిగడ్డ రూ.24, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.40, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.30, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.60-70, మునగ కాయలు రూ.5-6, పచ్చిబఠాణి రూ.40, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.160, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.140, చింతపండు రూ.160, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.95, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.60, పల్లికాయ రూ.50, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 వరకు అందుబాటులో ఉంటాయి.



ఎమ్మెల్యే కృష్ణారావును కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు

ఫతేనగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ఎమ్మెల్యే నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కంచి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



భరత్‌నగర్ హరిహరక్షేత్రంలోని శ్రీవారి పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

శ్రీవారికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

ఫతేనగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ డివిజన్ పరిధి భరత్‌నగర్ హరిహర క్షేత్రంలోని శ్రీ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు కార్పొరేటర్‌కు అతని వెంట వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలు, అందజేశారు.

ఎంబ్లర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఎక్సలెన్స్ పుస్తకావిష్కరణ

హైదర్‌నగర్, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఎంబ్లర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఎక్సలెన్స్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం శ్రీహోలిస్టిక్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ ఎల్‌వి సుబ్రహ్మణ్యం, సత్యం కంప్యూటర్స్ టెక్ మహేంద్ర మాజీ సీఈఓ ఏఎస్ మూర్తి, హోలిస్టిక్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వీఎస్ రామచంద్రరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈఎంఆర్‌ఐ 108మాజీ సీఈవో వెంకట్ చంగవల్లి రచించిన ఎంబ్లర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఎక్సలెన్స్ పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పుస్తకం వ్యక్తిగత స్థాయిలో పనితీరు మెరుగుదల కోసం రివ్యూ ప్రాసెస్‌లు ఎంతగానో సహాయపడతాయన్నారు. ప్రతిభతో కూడిన సంస్కృతిని పెంపొందిస్తాయనే విషయాలను వివరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఏఎస్ మూర్తి, డాక్టర్ వీఎస్ రామచంద్రరావు

ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభ



ఉగాది రోజున కూకట్‌పల్లిలోని వివేకానందనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు ఉగాది పురస్కారం అందజేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

ఆచార్య దార్లకు ఏపీ సీఎం ఉగాది పురస్కారం

రాయదుర్గం, మార్చి30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారంతో సత్కరించింది. ఆదివారం విజయవాడలోని తుమ్మపల్లి కళాక్షేత్రంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆచార్య దార్ల ఈ పురస్కారం అందుకున్నారు. దార్ల వెంకటేశ్వరావు కవిగా, దళిత తాత్వికుడు, నెమలి కన్నులు, కవితా సంపుటాలను, వీచిక సాహిత్య విమర్శ వ్యాసాలు, బహుజన సాహిత్య దృక్పథం, సాహితీ సులోచనం, ఆత్మకథ, నెమలి కన్నులు తదితర గ్రంథాలను ఆయన రచించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు, అధ్యాపకులు, విద్యార్థులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఉగాది పర్వదినం ఆనందమయం కావాలి : ఎమ్మెల్యే

హైదర్‌నగర్, మార్చి30(ఆంధ్రజ్యోతి): నిజాంపేట రోడ్‌లోని భాగ్యనగర్ కమ్మసేవా సంఘాల సమన్వయ సమితి కార్యాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా జరిగిన వేడుకల్లో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం ప్రజలందరికి మంచి జరగాలని, జీవితం కొత్త ఆశలు, ఆశయాలు, ఆలోచనలతో నవ వసంతం ఆనందమయం కావాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాసదాస్, గాంధీ, ప్రసాద్, నరసింహారావు, సుబ్బారావు, రంగరాయప్రసాద్, కోనేరు ప్రసాద్, శ్రీరామ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పచ్చడిని కాలనీవాసులకు అందిస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

పండుగలు కలిసిమెలిసి జరుపుకోవాలి: కార్పొరేటర్

భెల్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పండుగలను కార్మికులందరూ కలిసిమెలిసి జరుపుకోవడం వల్ల ఐక్యమత్యం పెరుగుతుందని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. ఉగాది సందర్భంగా డివిజన్ పరిధిలో గల పలు దేవాలయాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అన్ని వర్గాలు, కులాలు, మతాలకు చెందిన కార్మికులు నివసిస్తున్న బీహెచ్‌ఈఎల్ ఎంఐజీలో ప్రతీ పండుగను అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం వారిలోని స్నేహభావానికి నిదర్శనమన్నారు. కార్మికులందరూ కలిసి ఉంటున్నందునే భెల్ పరిశ్రమ అభివృద్ధి చెందిందని, లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఎంఐజీకాలనీలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి పంపిణీలో పాల్గొని కాలనీవాసులకు అందచేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బూన్, మహిళా సంఘాల ప్రతినిధులు శ్రీలత, స్వరూప, శ్రావణి, శోభ, సుజాత, అఖిల, శ్వేత, విజయలక్ష్మీ, శిరీష, నాయకులు రాజు, రాధాకృష్ణ, పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

చలివేంద్రాలు ప్రారంభం

హైదర్‌నగర్,మార్చి30(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ ఉషాముళ్లపూడి కమాన్ వద్ద క్షత్రియ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరికి చల్లని మజ్జిగ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉగాది రోజు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని క్షత్రియ యూత్ అసోసియేషన్‌ను అభినందించారు. వేసవిలో బాటసారులు, వాహన దారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయన్నారు.



లింగంపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్, ఎల్లేశ్

లింగంపల్లి డివిజన్ పరిధిలో..

గచ్చిబౌలి, మార్చి30(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలు బాటసారుల దప్పిక తీరుస్తాయని భారతీయ జనతాపార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ నాయకులు ఎల్లేశ్ ఆధ్వర్యంలో లింగంపల్లి డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగంపల్లి ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, ప్రస్తుత వేసవి కాలంలో ఎండ తీవ్రత చాలా ఉందని ముఖ్యంగా బయట తిరిగేవారు తరచూ నీటిని తాగుతూ ఉండాలని లేకుంటే డీహైడ్రేషన్‌కు గురై అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. వాహనదారులు, బాటసారులు తప్పకుండా తాము ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఉపయోగించు కోవాలని కోరారు.

భెల్‌కాలనీలో...



లింగంపల్లి చౌరస్తాలో చలివేంద్రం

భెల్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. విశ్వావసునామ సంవత్సరం సందర్భంగా టౌన్‌షిప్‌లో గల సత్యసాయి మందిరంలో ఆదివారం నిత్య భజనలతో పాటు విశేష కార్యక్రమాలు జరిగాయి. లింగంపల్లి చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సమితీ సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా బోర్లు!

- భూగర్భజలాలను తోడేస్తున్న అపార్ట్‌మెంట్ బిల్డర్లు
- టీఎన్‌జీఓ కాలనీలో కనీస నిబంధనలు పాటించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాయదుర్గం, మార్చి30 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రోడ్లపై యథేచ్ఛగా బోర్లు వేస్తూ కొందరు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. అందునా అధికారుల అనుమతి లేకుండా భూగర్భజలాలను తవ్వేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట, మియాపూర్ ప్రాంతాల్లో భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటిపోతున్నాయి. ఫలితంగా ఆరున్నర అంగుళాల బోర్ల తవ్వకాలు కొన్ని కాలనీల్లో వివాదాలకు తావిస్తున్నాయి. భూగర్భజలాల పరిరక్షణలో వీటికి అనుమతి తప్పనిసరి. ఈ తతంగం పూర్తిచేయడం వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారమని, దీంతో కొందరు నిబంధనలు అతిక్రమించి 50నుంచి 100 గజాలలోపు ఇళ్ల నిర్మాణానికే ఆరున్నర అంగుళాల బోర్లను తవ్విస్తున్నారు. కొంతమంది రోడ్లపై కూడా ఇష్టానుసారం బోర్లువేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై వాగ్వాదానికి సైతం దిగుతున్నారు. కమర్షియల్ భవన యజమానులు చేసే అరాచకాలకు సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాజాగా శనివారం టీఎన్‌జీఓ కాలనీలో రోడ్డుపైనే బోరువేస్తూ ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతున్నారు.

వాణిజ్య భవనాలతోనే సమస్యలు

ఒకప్పుడు 200నుంచి 300 అడుగుల వరకే బోర్లు తవ్వేవారు. జనావాసాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో ఇవి సరిపోయేవి. ప్రస్తుతం 1000 నుంచి 2000 అడుగుల వరకు బోర్లు వేస్తున్నారు. అపార్ట్‌మెంట్ బిల్డర్లు, రెడీమేడ్ ఇళ్ల నిర్మాణం చేపట్టేవారే అధికంగా ఉన్నారు. కొన్ని కాలనీల్లో 200 గజాల్లోనే మూడు రెడీమేడ్ ఇళ్లను నిర్మిస్తూ మూడు బోర్లు వేస్తున్నారు. హాస్టళ్లకు అద్దెలకు ఇవ్వడంతో జనం ఎక్కువగా ఉండటంతో నీరు సరిపోవడం లేదు. దీనిపై అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఒకరు 100 అడుగులు వేస్తే మరొకరు 200 అడుగులు వేస్తారు. దీంతో మొదటి బోరు ఎండిపోతుంది. కొంతమంది చేసే పనులకు మిగతా వారు కూడా తమబోర్లలో నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు.

పొగరూపంలో కమ్మేస్తున్న పౌడర్

బోర్లు వేసే సమయంలో యజమానులు కనీస నిబంధనలు పాటించడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికులు గంటల సమయం నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా బోర్లు వేసే సమయంలో పరిసరాలు బోరు నుంచి వచ్చే రాయి పౌడర్ మొత్తం పరిసరాల ఇళ్లను కమ్మేయడంతో ఉబ్బసం వంటి రోగులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోని సామాన్లు పాడవడమే కాకుండా చిన్నారులు అనారోగ్యంపాలవుతున్నారు.

రెండువేల అడుగుల వరకు బోర్లు

కొంతమంది తమ ఇష్టమొచ్చినట్లు ఆరు అంగుళాలు, 1000 నుంచి 2000 అడుగుల వరకు బోర్లు వేయడంతో పక్కబోర్లలో నీరు రావడం లేదు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసి కమర్షియల్‌కు అద్దెకు ఇవ్వడంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. స్టోన్ పౌడర్‌తో ఊపిరాడక చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

\- శ్రీకాంత్‌రెడ్డి, గచ్చిబౌలి



టీఎన్‌జీవో కాలనీలో రోడ్డుపైనే వేస్తున్న బోరు, రోడ్డుపై చేరిన మట్టి

బోర్లను పరిశీలించి సీజ్ చేస్తాం

బోర్లు వేసేవారు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలి. చట్టప్రకారం నిబంధనలు పాటించాలి. భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకుని నాలుగున్నర అంగుళాల బోర్లను మాత్రమే తవ్వించాలి. పర్మిషన్ లేకుండా వేస్తున్న బోర్లను పరిశీలించి సీజ్ చేస్తాం. పబ్లిక్ రోడ్లపై బోర్లు వేసేవారిపై కూడా కఠినంగా వ్యవహరిస్తాం. బోర్లను సైతం సీజ్ చేస్తాం.

\- రాంబాబు, ఆర్ఐ

కన్నుల పండువగా ఉగాది వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పంచాంగం వినిపించిన అర్చకులు



రాశిఫలాలపై పంచాంగ శ్రవణం చేస్తున్న ప్రధాన అర్చకులు




ధర్మపురి క్షేత్రంలో ఉగాది సంబరాలు

భెల్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలు భెల్ టౌన్‌షిప్‌లోగల అన్ని ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. నూతన సంవత్సర ఆరంభం పురస్కరించుకుని ఆదివారం అన్ని ఆలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు, శాస్త్రోక్తంగా జరిగాయి. కాలనీలోగల శ్రీ వేంకటేశ్వర, యోగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ సహస్రనామ పారాయణ, విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ పారాయణాలను నిర్వహించి అభిషేకాలు చేశారు. స్వామి వారి మహామండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాల్లో దేవాలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణం వినిపించారు. సంవత్సర రాశి ఫలితాలు,. దోషాలు, వాటి నివారణ చర్యలు, నవ నాయకుల పాలనా విధానాలు, దేశ ప్రగతి తదితర అంశాలపై విశ్లేషణలతో ఉపన్యాసాలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 108 సుగంధ పుష్పాలు, ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం, సుదర్శన హోమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పంచాంగ శ్రవణం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ధర్మపురి క్షేత్రంలో...

మియాపూర్,మార్చి30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మియాపూర్ దీప్తిశ్రీనగర్ ధర్మపురి క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదస్వస్తి వేదపారాయణం, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ ట్రస్టీ గొట్టిపాటి సత్యవాణి ఆధ్వర్యంలో సందడిగా సాగాయి. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని ఘనంగా సత్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్‌వి సుబ్రహ్మణ్యం, ఏఎస్ మూర్తి, డాక్టర్ వీఎస్ రామచంద్రరావు

ఎంబ్లర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఎక్స్‌లెన్స్ పుస్తకావిష్కరణ

హైదర్‌నగర్, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఎంబ్లర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఎక్స్‌లెన్స్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం శ్రీహోలిస్టిక్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ ఎల్‌వి సుబ్రహ్మణ్యం, సత్యం కంప్యూటర్స్, టెక్ మహేంద్ర మాజీ సీఈఓ ఎఎస్ మూర్తి, హోలిస్టిక్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వివిస్ రామచంద్రరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈఎంఆర్ఐ 108మాజీ సీఈవో వెంకట్ చంగవల్లి రచించిన ఎంబ్లర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఎక్స్‌లెన్స్ పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పుస్తకం వ్యక్తిగత స్థాయిలో పనితీరు మెరుగుదల కోసం రివ్యూ ప్రాసెసులు ఎంతగానో సహాయపడతాయన్నారు.

ప్రతిభతో కూడిన సంస్కృతిని పెంపొందిస్తాయనే విషయాలను వివరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సాంస్కృతిక శోభ



ఉగాదిరోజున కూకట్‌పల్లిలోని వివేకానందనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

భెల్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భెల్ ఎంఐజీ కాలనీలోని శ్రీ రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినం నుండి శ్రీ రామనవమి పర్వదినం వరకూ ప్రతీరోజు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం శ్రీ సీతారామచంద్రుల మూలమూర్తులకు అభిషేకం, నూతన వస్త్రాధారణ జరిగాయి. సాయంత్రం విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం దేవాలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణాచార్యులచే నిర్వహించారు. భజన మండలిచే భక్తిగీతాలాపన, సంగీత కచేరీ జరిగింది. ఉత్సవాల్లో దేవాలయ అధ్యక్షుడు భీంరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో పూజల్లో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి - రాయదుర్గం, (ఆంధ్రజ్యోతి)



బొటానికల్ గార్డెన్స్ వద్ద సమావేశమైన ప్రజా సంఘాలు

కొండా లక్ష్మణ్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

బాపూజీ ఫెడరేషన్ డిమాండ్

గచ్చిబౌలి, మార్చి30(ఆంధ్రజ్యోతి): నిజాం నిరకుశ వ్యతిరేక పోరాట యోధుడు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నాయకులు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని, బాపూజీ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం కొండా లక్ష్మణ్ ఫెడరేషన్ తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్స్ ప్రధాన గేటు వద్ద సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కొండాపూర్, గచ్చిబౌలిలో ర్యాలీగా బయలు దేరి గార్డెన్స్ గేట్ వద్ద సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు, బీసీ సంఘాల, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి కుల సంఘ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ తన సర్వస్వం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు.



ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086

ఘనంగా ఉగాది వేడుకలు

జోన్‌బృందం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు దుండిగల్ మున్సిపల్, నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి మున్సిపల్, గాజులరామారం జంట సర్కిళ్లలో కాలనీలు, బస్తీల్లో ఉగాది వేడుకలను నాయకులు, బస్తీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు పంచాంగ శ్రావణాన్ని ప్రజలకు చదివి వినిపించారు.



బౌరంపేట మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉగాది సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను శాలువాతో సన్మానించారు



సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్



నూతన సంవత్సర పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు



గాజులరామారం బాలయ్యబస్తీలో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణాన్ని వింటున్న బస్తీవాసులు

ఆస్తి పన్నుల చెల్లింపునకు చివరి అవకాశం

కుత్బుల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల చెల్లింపుకు సోమవారం చివరి రోజు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 42,811 వేలకు పైగా, గాజులరామారం సర్కిల్ పరిధిలో 53394 వేలకు పైగా నివాసాలు, ట్రేడ్ లైసెన్సులు పొందినవారున్నారు. అయితే ఇప్పటి వరకు చాలావరకు పన్నులు చెల్లించారని, కొందరు మాత్రమే చెల్లించకుండా మొండికేస్తున్నారని సమాచారం. మార్చి 31వ తేదీ దాటితే అధికారులు నేరుగా ఇంటికి వచ్చి ఆస్తులను జప్తు చేసే అవకాశముంది.

ఈ నేపథ్యంలో 31వ తేదీ వరకు పూర్తి స్థాయి పన్నులు చెల్లించాల్సిందేనని అధికారులు, సిబ్బంది ఇప్పటికే పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేశారు. పన్నులు పూర్తి చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలు తెలిపారు. ప్రభుత్వ సెలవురోజు అయినప్పటికీ పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ బాల్‌రెడ్డినగర్‌లోని శ్రీమారుతిసాయి ఉమామహేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని భావించి కాలనీ వాసులంతా కలిసి మండపాన్ని నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్‌ల అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, నేతలు వేణు యాదవ్, సత్తిరెడ్డి, రమణారెడ్డి, రమేష్, సత్యనారాయణ, అజయ్, శ్రీనివాస్, శ్రీశైలంయాదవ్, సుధాకర్‌రెడ్డి, జేబీ శర్మ, వెంకటేశ్వరరావు, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

దుండిగల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తూ శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను సూచించేది రంజాన్ పండుగని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. రంజాన్ సందర్భంగా రాష్ట్రంలోని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్యాగం, ఉపవాసం, సహనం, దయ, సేవాభావం వంటి మహోన్నతమైన విలువలతో కూడిన ప్రతిక రంజాన్ అని అన్నారు. ముస్లిం సోదరులు నెలరోజుల పాటు ఉపవాసం, భగవంతుని సంకల్పాన్ని పాటిస్తూ, ఇతరుల కష్టాన్ని అర్థం చేసుకోవడం, పేద వారిని ఆదుకోవడం వంటి ఆధ్యాత్మిక స్ఫూర్తిని రంజాన్ మాసం నింపుతుందన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



నవోదయనగర్‌లో తిరుగుతున్న కుక్కలు

కుత్బుల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని నవోదయనగర్, బాపునగర్, న్యూమాణిక్యనగర్, పద్మానగర్ ఫేజ్-2 తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే ప్రజల వెంట పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీధి కుక్కలు రెచ్చిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను మా కాలనీల నుంచి తరలించాలని వేడుకుంటున్నారు.



మర్యాద పూర్వక కలయిక

అఖిల భారత రజక ధోబీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా పి.నవ్య నియమితులైన సందర్భంగా నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

- నిజాంపేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)

పడకేసిన పారిశుధ్యం

- వాజ్‌పాయినగర్‌లో అధ్వానంగా అంతర్గత రహదారులు
- పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వాజ్‌పాయినగర్‌లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయి. చెత్తను తొలగించరు, రోడ్లను బాగు చేయరు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన మట్టిని తొలగించడం లేదని స్థానికులు తెలుపుతున్నారు. అవసరమైన మౌలిక వసతులు మచ్చుకైనా కన్పించడంలేదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నేతలు ఎన్నికల్లో గెలిపించిన తర్వాత గద్దె నెక్కుతారని, ఆ తర్వాత మా బస్తీకి ఏనాడూ రారని, ఇచ్చిన హామీలు నీటి మీది రాతలుగానే మిగిలిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గుక్కెడ మంచినీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని, పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండడంతో అనారోగ్యాలకు గురవుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు.

సమస్యలివే

- వాజ్‌పాయినగర్, సంజీవయ్య నగర్ సరిహద్దులోని రోడ్డులో ఐదు సంవత్సరాల క్రితం తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్వి ప్యాచ్‌లను చేయకపోవడంతో రోడ్డంతా శిథిలావస్థకు చేరుకుని రాకపోకలు సాగించడం కష్టతరమైంది.
- గోపయ్య గల్లీతో ప్రసూననగర్ వెళ్లే రోడ్డులో ఓపెన్ డ్రైనేజీ కాలువ మట్టితో కూరుకుపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు కొత్త ప్రతిపాదనలు రూపొందించి బాక్స్‌లైన్ వేయించారు. వరద నీరు వెళ్లే ప్రాంతంలో బాక్స్‌లైన్ ఎత్తు కట్టడంతో పద్మానగర్, సంజీవయ్యనగర్, బాపునగర్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు ఈ వీధుల్లో నిలిచి ఇండ్లలోకి చేరుతుంది. డ్రైన్ పనులు అసంపూర్తిగా ఉండడంతో వరదతో పాటు వచ్చిన బురద ఇండ్ల ముందు నిలుస్తుంది. చిన్న పిల్లలు ఆరుబయట ఆడుకునే సమయంలో ఆ మట్టి కుప్పల వద్దకు వెళ్తున్నారని, రోగాలు వచ్చే అవకాశముందని స్థానికులు తెలుపుతున్నారు.
- వినాయక మండపానికి రెండువైపులా గల నివాసితులకు తాగునీటి పైప్‌లైన్ వేసినప్పటికీ గోపయ్య గల్లీలో సరిపోయేలా నీరు రావడంలేదు.



వాజ్‌పాయినగర్‌లో రెండు రోడ్ల దుస్థితి



సంజీవయ్యనగర్-వాజ్‌పాయినగర్ సరిహద్దు రోడ్డులో బురదకుంట



మురుగు కుప్పల వద్ద ఆడుకుంటున్న పిల్లలు

నీటిని ఎక్కువగా వదలాలి



కాలనీలోని చాలామందికి నీరు సరిపోయేలా రావడంలేదు. పైప్‌లైన్ ఎత్తుగా ఉండడంతో తక్కువగా వస్తున్నాయి. మా రోడ్డులోని ప్రజలకు నీటిని ఎక్కువ సమయం వదలాలి. రోడ్డులోని మట్టి, బురదతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. మా సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటున్నాం.

- మోహన్, స్థానికుడు

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు



రెండంతస్తుల పాత ఇంటిపై మరో రెండు అంతస్తులను వేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ.. అదుపు లేకుండాపోతోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన పాత నిర్మాణాలపై ఒకటి, రెండు కాదు మూడంతస్తుల వరకు అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పాత వాటిపై నిర్మాణాలకు ఎలాంటి అనుమతులుండవు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులను మచ్చిక చేసుకోవడం, స్థానిక ద్వితీయశ్రేణి నాయకుల అండతో పేక మేడలను తలపించేలా నిర్మాణాలను చేపడుతున్నారు. అదే విధంగా కొన్ని ప్రాంతాల్లో 40, 60, 100, 150 గజాల్లోనూ ఐదంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. ఆయా కాలనీల్లో జీ+1 వరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, వాటికి అనుగుణంగానే తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, రోడ్ల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అయితే అనుమతికి మించి నిర్మాణాలను చేపట్టడం వల్ల మౌలిక వసతుల సమస్యలు తలెత్తే అవకాశముంది. అలాగే పాత భవనాలపై కొత్తవి నిర్మిస్తే అవి కూలిపోయే అవకాశముంది. ఇంత జరుగుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు మిన్నకుండిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



100 గజాల్లో ఐదంతస్తుల భవనం

ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభ









ఉగాది రోజున కూకట్‌పల్లిలోని వివేకానందనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు ప్రతాప్‌గౌడ్, మసీద్ కమిటీ సభ్యులు

పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

పేట్‌బషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుల మతాలకు అతీతంగా పండుగలను నిర్వహించుకున్నప్పుడే స్నేహభావం పెంపొందుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కెం.ఎం.ప్రతాప్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లో ఎంఎన్‌రెడ్డినగర్‌లోని నూరె మహ్మదీయా, మసీదు కమిటీ సభ్యులు రంజాన్ సందర్భంగా కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాంకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జుబేర్, హుస్సేన్, ఇస్మాయల్, సయ్యద్, ఇబ్రహిమ్, అమీనుద్దీన్, మున్‌సూన్, ఫిరోజ్ పాల్గొన్నారు.



ప్రగతినగర్‌లో ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

సహజ పానీయాలు ముద్దు.. కూల్‌డ్రింక్స్ వద్దు

నిజాంపేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక సభ్యులు బాచుపల్లి మండలం ప్రగతినగర్‌లో ఉగాది పచ్చడి విశిష్టతను ప్రజలకు వివరించారు. సహజ పానీయాలను తాగుదాం... కూల్‌డ్రింక్స్‌ను మానేద్దామని, ప్రజలకు కూల్‌డ్రింక్స్ తాగడం కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. అనంతరం సుమారు రెండువందల మందికి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవళిక, జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు మధుకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు శంకరరావు, అమీర్ బాష, డాక్టర్ ప్రశాంత్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన వ్యర్థాలు

రోడ్డుపై భవన నిర్మాణ వ్యర్థాలు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

గాజులరామారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీంతో స్థానికులకు ఇబ్బంది కలగడమే కాకుండా, ఆ వ్యర్థాలు రోడ్డుపై పడుతుండడంతో వాహనదారులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గాజులరామారం డివిజన్‌లోని కైసర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నుంచి ప్రగతినగర్‌కు వెళ్లే దారిలో భవన నిర్మాణ వ్యర్థాలు కుప్పలుగా దర్శనం ఇస్తున్నాయి. గాలి వీచినప్పుడు కళ్లలో దుమ్ము పడి కళ్లమంటలు మండుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన పడవేస్తున్న వ్యర్థాలను వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలమైన మ్యాన్‌హోళ్లు..పొంచి ఉన్న ప్రమాదం

కుత్బుల్లాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాపునగర్‌లో శిథిలమైన మ్యాన్‌హోళ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా బాపునగర్ పోచమ్మ దేవాలయం నుంచి పద్మానగర్ రింగురోడ్డు వైపు వెళ్లే రోడ్డులో ఎనిమిది సంవత్సరాల క్రితం భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేయించారు.



పోచమ్మ ఆలయం సమీపంలో శిథిలమైన మ్యాన్‌హోల్ పైకప్పు



బాబు ఇంటి సమీపంలో కుంగిపోయిన మ్యాన్‌హోల్

మ్యాన్‌హోళ్లు పాతవి కావడంతో వాహనాలు వాటిపై నుంచి వెళ్లినప్పుడు పగిలిపోవడం, పైకప్పులు లోపలికి కుంగిపోవడం జరుగుతోంది. ద్విచక్ర వాహనదారులు గమనించక వాటిపై నుంచి పోతే కూలిపోయే అవకాశముందని, ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కొత్త మ్యాన్‌హోళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తవి ఏర్పాటు చేస్తాం

ఈ విషయంపై కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహను వివరణ కోరగా.. బాపునగర్‌లో పర్యటించి పరిశీలిస్తాం. అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఫ్లెక్సీ దగ్ధం చేసిన వ్యక్తులపై ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది, శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సురేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. కొంపల్లి మున్సిపల్‌లోని జయభేరిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన సభ్యులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో ఉన్న బీజేపీ మాజీ కౌన్సిలర్ జీవ్‌రెడ్డి ఫోటోను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దగ్ధం చేశారు. ఉదయం దీనిని గమనించిన యువసేన సభ్యులు ఆదివారం పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత మూడు రోజుల నుంచి భవనం నుంచి ఫ్లెక్సీ తీసివేయాలని, ఏమి చేయాలో ఆదే చేస్తానని కొందరు బెదిరించినట్లు వినతి పత్రంలో పేర్కొంటూ వారి సెల్ నంబరుతో సహా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
పున్నారావు: 9985921366